ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 నంద్యాల

జిల్లా వార్తలు

సోమవారం 11 మార్చి 2024



రమణీయం..

రథోత్సవం



● వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

● అశ్వ వాహనంపై ఊరేగిన మహానందీశ్వరుడు

భక్తజనసందోహం నడుమ సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్‌లో ఉత్సవమూర్తులు)

మహానంది, మార్చి 10 : మహానంది క్షేత్రంలో రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్లతోపాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన బ్రహ్మనందీశ్వరుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రుత్వికులు పూజలు నిర్వహించారు. రథ శాల వద్ద శాస్త్రోక్తంగా నారికేళతోపాటు హోమాలు, గుమ్మడి కాయలను సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను రథశాల వద్దకు మేళతాళాలతో తీసుకొచ్చి రథంపై ఆశీనులు గావించారు. సాంప్రదాయం ప్రకారం కుమ్మారి వీరయ్య భక్తి శ్రద్ధలతో చేసిన కుంభాన్ని రథ శాల వద్దకు తీసుకొచ్చి మూడు ప్రదక్షిణలు చేసి కుంభ బలిని సమర్పించారు. అనంతరం మహానంది మండల తహసీల్దార్ ఆదినారాయణ, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, శివరాత్రి కళ్యాణ దాతగా వ్యవహరించిన లక్కబోయినప్రసాద్‌తో పాటు అధికారులు సాయంత్రం 5 గంటలకు రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం సమయంలో మహిళల కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లుతో పాటు పలు శాఖల అధికారులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం అశ్వవాహనంపై మహానందీశ్వరుని గ్రామోత్సవం నిర్వహించారు.

యాగంటి జనసంద్రం

ఘనంగా సాగిన ఉమామహేశ్వర స్వామి రథోత్సవం



యాగంటి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, మార్చి 10: యాగంటి ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో ఉమామహేశ్వర స్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం ఆదివారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. ఉమా మహేశ్వర స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, చైర్మన్, ఈవోల ఆధ్వర్యంలో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకు వచ్చారు. ఉమామహేశ్వర స్వామి వార్ల విగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై కూర్చోబెట్టి ఆలయ పాలకవర్గ సభ్యులు, భక్తులు రథం వద్ద గుమ్మడి కాయలు, కొబ్బరి కాయలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు రంగులు చల్లుకుంటూ ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. బనగానపల్లె సీఐ గంటా సుబ్బరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

బ్రహ్మోత్సవాలకు

యాగ పూర్ణాహుతి

● నేడు అశ్వవాహన సేవ, పుష్పోత్సవం

● నేటితో ముగియనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు



శ్రీశైలం, మార్చి 10: శ్రీశైలంలో నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం పదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అర్చకులు, వేదపండితులు యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృదం, త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమ గుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తరువాత వసంతోత్సవం జరిపించి సమంత్రకంగా భక్తులపై సంప్రోక్షించారు. అనంతరం చండీశ్వర స్వామికి ఆలయ పుష్కరిణిలో ఆగమశాస్త్రోక్తంగా అవబృదస్నానం నిర్వహించారు. చివరగా త్రిశూలస్నానం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఈవో డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

● ధ్వజావరోహణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంకాలం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహణ చేశారు.

● సదస్యం..నాగవల్లి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు నిత్యకళ్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమం జరిపించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. వేదస్వస్తిలో వేదపండితులు చతుర్వేద పారాయణలతో, స్తోత్రాలతో స్వామిఅమ్మవార్లను స్తుతించారు. నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి పర్వదినాన మల్లన్నను కళ్యాణమాడిన భ్రమరాంబ అమ్మవారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలను సమర్పించారు. సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం స్వామిఅమ్మవార్లకు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు అశ్వ వాహనసేవ, ఆలయ ఉత్సవం జరిపించనున్నారు.



ఆలయ పుష్కరిణిలో చండీశ్వర స్వామికి అవబృదస్నానం



శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం

నేటితో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగుస్తాయని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం ఆలయం ప్రాంగణంలోని రుద్ర గుండం కోనేరులో వేదపండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు త్రిశూల స్నానం, ధ్వజ అవరోహణం జరుపుతారన్నారు. అనంతరం యాగశాల మండపంలో బ్రహ్మోత్సవ యాగశాల ఫల సమర్పణ, నాకబలి పూజలతో పాటు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. రాత్రి రుద్రగుండం కోనేరులో కన్నుల పండువగా తెప్పోత్సవం జరుపుతామని ఈవో పేర్కొన్నారు.

నల్లమలమల



ఎండిన చెట్లతో కళావిహీనంగా నల్లమల



నాడు పచ్చని అందాలతో దర్శనమిస్తున్న నల్లమల

ఆత్మకూరు, మార్చి 11: ప్రకృతి రమణీయతకు ప్రతిబింబంగా నిలిచే నల్లమల అడవి ఆకురాలి కళావిహీనంగా కనిపిస్తోంది. పచ్చదనంతో ఆహ్లాదం పంచే ఆత్మకూరు-వెలుగోడు రహదారి ఎండిపోయిన చెట్లతో దర్శనమిస్తోంది. దీంతో ఆ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులకు కనీసం సేద దీరడానికి కాసింత నీడ కూడా కరువైంది. శిశిర రుతువులో చెట్లన్నీ ఆకురాలగా వసంత రుతువు వచ్చే సరికి మళ్లీ చిగురించి పచ్చదనాన్ని పరుచుకుంటాయి. ఆ తరువాత గ్రీష్మ రుతువులో కొద్ది రోజులు మండుటెండలు ఉన్నప్పటికీ అప్పుడప్పుడు కురిసే వర్షాలతో చెట్లు హాయినిస్తూ సేదతీరుస్తాయి. అలాగే వర్షాకాలంలో నల్లమల మరింత పచ్చదంతో పర్యావరణ ప్రేమికుల్ని ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత వచ్చే శరత్‌రుతువు, మంచుకురిసే హేమంత రుతువులో నల్లమల అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఆత్మకూరు - వెలుగోడు రస్తాలోని ఎండిపోయి మళ్లీ చిగురించడానికి వసంత రుతువు కోసం చూస్తున్నాయి.

ఫరూక్, భూమా మధ్య సయోధ్య

ఇరువురిని ఉరవకొండకు పిలిపించి మాట్లాడిన లోకేశ్



లోకేష్‌తో ఫరూక్, భూమా

నంద్యాల (నూనెపల్లె), మార్చి 10 : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనంద రెడ్డి మధ్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సయోధ్య కుదిర్చారు. గత నాలుగున్నరేళ్లుగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2024 ఎన్నికల నేపథ్యంలో ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాల టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించి నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఫరూక్‌ను టీడీపీ అధిష్ఠానం కేటాయించింది. టికెట్‌పై ఆశలు పెట్టుకున్న భూమా బ్రహ్మనందరెడ్డికి టికెట్ రాకపోవడంతో ఆయన వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఫరూక్, భూమా వర్గాలు ఎవరికివారుగా వ్యవహరించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే నారా లోకేశ్ అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆదివారం ఎన్ఎండీ ఫరూక్‌ను, భూమా బ్రహ్మనందరెడ్డిని పిలిపించి మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఉరవకొండ నియోజకవర్గ పరిశీలకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి పాల్గొన్నారు. ఫరూక్ విజయానికి సహకరించాలని, పార్టీ కార్యక్రమాలకు ఇద్దరూ కలిసి పని చేయాలని దిశానిర్దేశం చేశారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి శ్రీశైలం తరపున పట్టువస్త్రాలు



పట్టు వస్త్రాలు తెస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం, మార్చి 10: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామికి శ్రీశైల మల్లన్న దేవస్థానం తరపున ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీశైల దేవస్థానం తరపున శ్రీకాళహస్తీశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించడం ఇదే మొదటి సారి కావడం విశేషం. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 3న ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 16వ తేదీన ముగియనున్నాయి. పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. పట్టువస్త్రాలతో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకున్న వీరికి శ్రీకాళహస్తి ఈవో నాగేశ్వర రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకాలహస్తీశ్వరస్వామికి సమర్పించారు.

నేడు డీసీసీబీ బోర్డు సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 10: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బోర్డు సమావేశం సోమవారం బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సందర్భంగా జరుగుతున్న ఈ సమావేశంలో తమకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు ఉంటాయనీ ఉమ్మడి కర్నూలు జిల్లాల రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఆధ్వర్యంలో సీఈవో విజయకుమార్, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు ఈ సమావేశంలో పాల్గొంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల కల్చరల్, మార్చి 10: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటనరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి నిర్వహించే స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా జగనన్నకు చెబుతాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

నేటి పోలీస్ స్పందన రద్దు: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 10 : ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి వ్యయప్రయాసలకోర్చి రావద్దని ఆయన సూచించారు. వచ్చే సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

పంట లేక తంటా



గోదాముల్లో భద్రపరిచిన సబ్సిడీ బియ్యం



- భారీగా తగ్గిన సన్న వడ్ల సాగు
- క్వింటా బియ్యం రూ.6 వేల నుంచి రూ.6,500
- కొనలేకపోతున్న సామాన్యులు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 10: ఒకప్పుడు సన్న బియ్యం ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా నేడు వెనుకబడి పోయింది. ఈ పంట సాగుకు ఖర్చులు భారీగా పెరగడంతోపాటు తెగుళ్లు, వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. నిన్న మొన్నటి దాకా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మనదేశంతో పాటు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఏపీలోనే సన్నబియ్యం కొరతను తీర్చేందుకు అవసరమైన ఉత్పత్తి లేక ఉమ్మడి కర్నూలు జిల్లాల రైతులు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి దాపురించింది. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు తోడు ప్రస్తుతం మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన రేట్లతో సామాన్యులకు పూట గడవడం కష్టంగా మారింది. ఈ పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సంవత్సర కాలంలోనే బియ్యం ధరలు 25 శాతం దాకా పెరిగిపోయాయి. ఆ రకం.. ఈ రకం అనే తేడా లేకుండా అన్ని రకాల బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఏపీలో ప్రజల రోజువారి ప్రధాన ఆహారం బియ్యమే. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రపంచంలోనే భారతదేశం చైనా దేశం తర్వాత సన్నబియ్యం ఉత్పత్తిలో రెండో అతి పెద్ద ఉత్పత్తిదారుగా గుర్తింపు పొందింది. గత నెల రోజుల్లోనే అన్ని రకాల బియ్యం ధరలు ఏడు శాతానికి పైగా పెరిగాయి. సగటున ఈ బియ్యం కిలో రూ.40ల నుంచి రూ.60కు పెరగడంతో వినియోగదారులు లబోదిబోమం టున్నారు. కొన్ని రోజులుగా బియ్యం మిల్లులు, రిటైల్ షాపులకు వినియోగదారులు బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు పరుగులు పెడుతున్నారు. ధరలు ఇంతగా పెరగడానికి కారణం.. సాగు తగ్గడమే. రైతుల్లో ఆసక్తి తగ్గింది. బియ్యం ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా రైతుల్లో ఈ పంట సాగుపై ఆసక్తి తగ్గడమేనని వ్యవసాయశాఖ అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఖర్చులు విపరీతంగా పెరగడంతోపాటు వర్షాభావ పరిస్థితుల వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం లక్ష హెక్టార్లకు ఈ పంట సాగు పరిమితమైపోయింది. సాధారణంగా ఎకరాకు 20 క్వింటాళ్లకు పైబడి దిగుబడి రావాల్సి ఉండగా.. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల వెంటాడటంతో పది క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు.

దొడ్డు బియ్యం బ్లాక్ మార్కెట్‌కు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లావు బియ్యాన్ని ఉచితంగా రేషన్ షాపుల ద్వారా అందిస్తోంది. అయితే ఈ బియ్యాన్ని వినియోగదారులు ఆహారంగా వాడడం లేదు. నూటికి 70 శాతం మందే ఈ బియ్యాన్ని బొరుగుల తయారీకి పక్క రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న దళారులకు కిలో బియ్యాన్ని రూ.10 ప్రకారం అమ్ముకుంటున్నారు. కర్నూలు నగరంలో వీధివీధికి ఇటువంటి దళారులు పెద్ద ఎత్తున పుట్టుకొస్తున్నారు. పాత నగరం, ఎన్టీఆర్ నగర్, వెంకటరమణ కాలనీ, కల్లూరు, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున దళారులు అధికారులకు మామూళ్లు ఇచ్చుకుంటూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా పెంచుకుంటూ పోతున్నారు. ఈ పరిస్థితుల్లో చౌక బియ్యాన్ని అందించడంతోపాటు దళారుల పాలు కాకుండా ఆంక్షలు విధించడంతో పాటు సన్న బియ్యాన్ని సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

దుర్మార్గ పాలన అంతానికే పొత్తు

టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 10: వైసీపీ జగన్‌రెడ్డి నిరంకుశ, దుర్మార్గ పాలనను తుదముట్టించేందుకే టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ నిరంకుశ, అప్రజాస్వామిక పాలనను అంతమొందించేందుకే పొత్తు ఏర్పాటైందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అయోమయంగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ అప్పులమయంగా మార్చేశాడన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, బడుగులు, మైనార్టీలపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను ఏవిధంగా అణిచివేసిందో ఆ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాటల్లోనే విన్నామని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి అరాచకాల పాలన మరే ఇతర రాష్ట్రాల్లో లేదని, అందుకే వారిని మూడు పార్టీలు కలిసి ఇంటికి సాగనంపేందుకు పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజల కోసం, రాష్ట్ర అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశాడన్నారు. అందుకే టీడీపీ ఏర్పాటై 42 సంవత్సరాలైనా ప్రజలు తమను ఆదరిస్తున్నారని తెలిపారు. అదే నమ్మకం, విశ్వాసంతోనే ఢిల్లీ బీజేపీ పెద్దలు పొత్తుల కోసం చంద్రబాబును ఆహ్వానించారన్నారు.

ఇంట్లో చోరీ

బంగారు, నగదు అపహరణ

నంద్యాల క్రైం, మార్చి 10 : నంద్యాల తాలుకా అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరినగర్ టైలర్స్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. తాలుకా పోలీసులు, బాధితుడి వివరాల మేరకు.. పాలిష్ బండలకు గ్రానైట్ పనిచేసే సోమశేఖర్ అనే వ్యక్తి ఇంట్లో నిద్రపోతున్నాడు. దొంగలు గదికి బయట గడియపెట్టి మరో గదిలోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 10తులాల బంగారు నగలు, రూ.10వేల నగదు, గ్రానైట్ పనికి తెచ్చుకున్న రెండు మిషన్లను అపహరించారు. తెల్లవారుజామున కాలకృత్యాలకు లేచిన సోమశేఖర్ తన గది తలుపునకు బయట గడియపెట్టడంతో పగలగొట్టి వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. తాలుకా పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాణ్యం, మార్చి, 10 : మండలంలోని గోనవరంకు చెందిన చిన్న మాదన్న (83) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. ఈనెల 8వ తేదీన విషపు గుళికలు మింగడంతో అపారస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య మూడు నెలల క్రితం మృతి చెందడంతో ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుందూ నదిలో మునిగి అక్కా తమ్ముడు మృతి



మృతి చెందిన ఇమాంబి, మస్తాన్

చాగలమర్రి, మార్చి 10: చాగలమర్రిలోని కూలూరు రహదారి సమీపం లోగల కుందూ నది నీటిలో పడి అక్కా, తమ్ముడు ఇమాంబి (28), మస్తాన్ (26) ఆదివారం మృతి చెందారు. అక్కా తమ్ముడు కలిసి శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో ఓ స్వామి వద్దకు వెళ్లి అనంతరం ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరారు. స్వామి వద్ద ప్రశ్న చెప్పించుకున్న అక్కా తమ్ముడు ఇంటికి వెళ్లక ముందే నది లేదా వాగులో స్నానం చేసి వెళ్లాలని అనుకున్నారు. ఇందులోభాగంగానే కూలూరు రహదారిలోని కుందూ నదిలోకి స్నానానికి వెళ్లగా నీట మునిగారు. నదీ సమీపంలో ఉన్న కొందరు గమనించి కేకలు వేశారు. ఈతగాళ్లు వచ్చి బయటకు తీసే లోపే వారు మృతి చెందారు. అక్కా, తమ్ముడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. కడప జిల్లా రాజపాలెం మండలం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ఇమాంబికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. మస్తాన్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. ఈ విషాద సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 10: అర్హత కలిగిన అభ్యర్థులు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో చేరేందుకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్మీ రిక్రూట్‌మెంటు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. జనరల్ డ్యూటీ, టెక్నికల్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ తదితర పోస్టులకు జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.

క్యాన్సర్ హాస్పిటల్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

11 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 10: కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన ఉద్యోగ ఖాళీల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 14 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి జనవరి 29న నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత 10 కేటగిరీ అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు Https//kurnool.ap.gov.in, https//nandyal.ap.gov.in, https//kurnoolmedicalcollege.ac.in లలో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ మెరిట్ లిస్టును వివరాలను సరి చూసుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ప్రిన్సిపాల్ కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని కోరారు.


టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా జి.నాగముని



కర్నూలు(లీగల్), మార్చి 10: టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా స్థానిక న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగమునిని నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగముని మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆశయాల సాధనకు తాను కృషి చేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రాఘవేంద్ర స్వామి గురు వైభోత్సవాలు

- ఈ నెల 12న 403వ పట్టాభిషేకం
- 14న 429వ రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకలు



మంత్రాలయం, మార్చి 10: మంత్రాలయ రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 12న రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం, 16న స్వామి 429వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. బంగారు సింహాసనంపై రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను అధిష్టించి బంగారు నాణేలు, ముత్యాలు, పుష్పాలతో అభిషేకం చేసి బంగారు రథంపై ఊరేగించనున్నారు. 16న రాఘవేంద్రస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నైకి చెందిన నాగాహార సేవా ట్రస్టు వారు 500 మంది సంగీత విద్వాంసులచే ఏకదాటిగా నాదాహారం చేయనున్నారు. ఆరు రోజులుగా జరిగే ఉత్సవాల్లో వైద్య, విద్యసాంకేతిక, సామాజిక, వైజ్ఞానిక సంస్కృత, వేద విద్యలో సేవలు అందించిన వారికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల అవార్డులు ప్రదానం చేయనున్నారు.

నోడల్ ఆఫీసర్లకు శిక్షణ పూర్తి చేయండి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 10: అన్ని అంశాలకు సంబంధించి బుధవారంలోపు నియోజకవర్గాల నోడల్ ఆఫీసర్లకు శిక్షణ పూర్తి కావాలని కలెక్టర్ జి.సృజన ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఆదివారం ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల నోడల్ అధికారులు జిల్లా నోడల్ అధికారులను కలిసి శిక్షణ తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్, స్క్రూటిని, ఎంసీసీ తదితర అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని ఆర్వోలను ఆదేశించారు. ఫ్యూయల్ స్టేషన్, లాగ్ బుక్ నిర్వహణ తదితర అన్ని అంశాలను మ్యాపింగ్, ట్రాన్స్‌పోర్టు మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుని నియోజకవర్గ కేంద్రాల్లో వాహనా లను సెక్టార్ ఆఫీసర్లకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, ఆదోని సబ్ కలెక్టర్ నారాయణశర్మ పాల్గొన్నారు.

అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీని నిర్మించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు, మార్చి 10: అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీని వెంటనే నిర్మించాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తక్ అహ్మద్ కోరారు. ఆదివారం మండలంలోని ఓర్వకల్లు సమీపాన ఉన్న అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో చేపట్టిన ఉర్దూ యూనివర్సిటీ ఎదుట టీడీపీ మైనార్టీ సెల్ నాయకులతో ధర్నా చేపట్టారు. యూనివర్సిటీకి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. చంద్రబాబు హయాంలో యూనివర్సిటీ కోసం 120 ఎకరాల స్థలం కేటాయించారని, వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్ల పాలనలో కనీసం నేటి వరకు ఏ ఒక్క పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జగన్ కట్టడాలను కూల్చడమే తప్ప.. నిర్మించడం లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రషీద్, ఖాజా, కరీముల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీతికి.. అవినీతికి జరిగే పోరాటం ఇది

- మంత్రి బుగ్గన అబద్ధాలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదు
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



బేతంచెర్లలో మాట్లాడుతున్న కోట్ల

డోన్/బేతంచెర్ల, మార్చి 10: డోన్ నియోజకవర్గంలో నీతికి, అవినీతికి జరుగుతున్న పోరాటంలో ప్రజలు ధర్మం వైపే నిలిచి టీడీపీని గెలిపిస్తారని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలో కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని మాజీ జడ్పీటీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి నివాసంలో మండల పార్టీ అధ్యక్షులు ఎల్లనాగయ్య, జిల్లా అధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డిలతో కలిసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడారు. మంత్రి బుగ్గన అబద్ధాలు చెప్పడం తప్ప డోన్ నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పిట్టకథలు చెబుతూ ప్రజలను మోసం చేయడం బుగ్గనకు అలవాటైపోయిందన్ని విమర్శించారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడ్డారని ఆయన [illegible] టీడీపీ హయాంలో వాటర్ గ్రిడ్ కింద డోన్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అవుకు రిజర్వాయరు [illegible] గుర్తు చేశారు. అయి[illegible] మార్పు చేసి గోరుకల్లు రిజర్వాయరు నుంచి డోన్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కొళాయిని ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నట్లు అన్ని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బుగ్గనను ఎవరైనా ప్రశ్నిస్తే.. అక్రమ కేసులతో ప్రజలను బెదిరింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు బుగ్గన చేసిన అభివృద్ధి ఏమీ లేదని, శిలాఫలకాల బోర్డులు మాత్రమే కనిపిస్తున్నాయని తెలిపారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు సార్లు సీఎం పదవి చేపట్టి ప్రజలకు నిజాయితీగా సేవ చేశారన్నారు. డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న ధర్మపోరాటంలో ప్రజలు టీడీపీని గెలిపిస్తారన్న నమ్మకం ఉందని కోట్ల ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, భీమేశ్వరరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



సంఘీభావ ప్రదర్శనలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, మార్చి 10: రాయలసీమలోని సాగునీటి నిర్మాణ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ సంయుక్త మోర్చ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రైతులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. ఆదివారం గాంధీ చౌక్ సెంటర్‌లో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సాగునీటి సాధన సమితి కార్యాలయం నుంచి ప్రదర్శనగా గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో సమానంగా రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా చర్యలు తీసుకోవాలని, సాగునీటి నిర్మాణాలకు, సమానాభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, ప్రజాసంఘాల కార్యదర్శి నెట్టూరి సుధాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

భవిష్యత్తుకు గ్యారెంటీలో గౌరు చరిత



19, 21 వార్డుల్లో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీలో మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 10: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటుతో వైసీపీ పతనం ఖాయమైందని పాణ్యం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు సోమిశెట్టినగర్, 21వ వార్డు సాయి తేజ అపార్ట్‌మెంట్‌లో ఆమె శంఖారావం, బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రసల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు టీడీపీ అధినేత చంద్రబాబు అని వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిందని అన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, మాంద్ర నరేంద్రరెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, కిట్టు యాదవ్, 21వ వార్డు ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, సుదాకర్, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగమణి, బాబురాజు, సువర్ణ, లలిత పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శిస్తే పుట్టగతులుండవు

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 10: టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శిస్తే పుట్టగతులుండవని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అద్దంకిలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబును విమర్శించడం సిగ్గు చేటన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను తొలగించిన మహానుబావుడు జగనే అన్నారు. పేదల కోసం రంజాన్, సంక్రాంతి, క్రిస్మస్ కానుకలను ఇస్తుంటే.. వైసీపీ అధికారంలోకి రాగానే జగన్ వాటిని రద్దు చేయడంతో పేదలు పండుగలను కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో చంద్రబాబు గెలవడం తథ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు కుదరడంతో జగన్ గుండెల్లో దడ పుట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగు పోటీల ప్రారంభిస్తున్న నిర్వాహకుడు సోమశేఖర్‌రెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఓంకారం, కృష్ణనంది క్షేత్రాల్లో బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం సీనియర్ విభాగం పోటీలు నిర్వహించారు. ఓంకారంలో ఎనిమిది జతలు, కృష్ణనందిలో తొమ్మిది జతల ఎద్దులు పోటీలలో పాల్గొన్నాయి. పోటీలలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు ఓంకారంలో రూ.2లక్షల, కృష్ణనందిలో రూ.1.30 లక్షల నగదు బహుమతులను విజేతలకు అందజేశారు. కార్యక్రమాల్లో ఛైర్మన్‌లు విశ్వనాథరెడ్డి, తిరుపంరెడ్డి, ఈవో నాగప్రసాద్, నిర్వహకులు మండల అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి. ఆదిలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ పోటీల్లో పెద్ద కొట్టాల వృషభాల విజయకేతనం

మహానంది, మార్చి 10: మహానందిలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రైతుకమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా ఆదివారం రెండో రోజు సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 2430 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం నిలిచాయని రైతు కమిటీ సభ్యుడు కందుల రఘురామిరెడ్డి తెలిపారు. అలాగే ద్వితీయ స్థానాన్ని గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె నాగిరెడ్డి వృషభాలు 2114.3 అడుగుల దూరం లాగాయి. తృతీయ స్థానాన్ని గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన సోహిత్‌రెడ్డి వృషభాలు, నాలుగో స్థానాన్ని గుంటూరు జిల్లా కొండపాటు గ్రామానికి చెందిన కాక లక్ష్మినారాయణ ఎద్దులు, ఐదో స్థానాన్ని బెస్తవా రిపేటకు చెందిన రసూల్ బీకి చెందిన వృషభాలు నిలిచాయని చెప్పారు. విజేతలైన ఎద్దుల యజమానులకు సోమవారం రాత్రి ఎద్దుల బల ప్రదర్శన క్రీడా మైదానంలో నగదు బహుమతులను అందజేశామని తెలిపారు.

ప్రత్యేక పూజలు

పాములపాడు మార్చి 10 : మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివార్లలోని సంజీవ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమవాస్యను పురస్కరించుకొని పురోహితులు జ్వాలముఖి రాఘవ శర్మ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు నిర్వహించారు. ఆలయం వద్ద రాత్రి పల్లకిసేవా, భజన కార్యక్రమం నిర్వహించారు.

అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు



ఆత్మకూరు, మార్చి 11: ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రాతఃకాల సమయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపి శాస్త్రోక్తంగా పూజక్రతువులను చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

రేపు మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

నంద్యాల టౌన్, మార్చి 10: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రప్ప తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌జీవో కాలనీలోని గురురాజా పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి 13వ తేదీ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, తిరుపాలయ్య, సునీల్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, నగర విభాగ అధ్యక్షురాలు లక్ష్మిదేవమ్మ, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి


సంటెన్న (ఫైల్)

పాణ్యం, మార్చి, 10 : పాణ్యం గ్రామానికి చెందిన విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్, అథ్లెటిక్ జాతీయ క్రీడాకారుడు కాంబాల సంటెన్న (78) ఆదివారం మృతి చెందారు. సంటెన్న చిత్రకళలో ఎన్నో సేవలందించడంతో పాటు క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పాటునందించారు. సంటెన్నకు భార్య, ముగ్గురు కుమారులు. ఈయన మృతి పట్ల నవోదయ కబడ్డీ అసోసియేషన్, సీనియర్ క్రీడాకారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, మండల చిత్రకళా సంఘం, నంద్యాల ఆర్టిస్ట్ అసోసియేషన్ సంఘాలు నివాళులర్పించాయి. ఎంఈవో సుబ్రహ్మణ్యం సంటెన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెలుగోడు, మార్చి 10 : వెలుగోడు పట్టణంలో ఆదివారం రాత్రి ఓ ఆటో ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెలుగోడు పట్టణానికి చెందిన శివలింగస్వామి మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై బస్టాండు వైపు నుంచి సీపీ నగర్‌కు బయలుదేరారు. ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న ఓ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివలింగస్వామికి తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాలకు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు చారిత్రాత్మకం

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, మార్చి 11: రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు చారిత్రాత్మకమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీని అంతమొందించేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల పొత్తు రాష్ట్ర భవిష్యత్‌కు ఎంతో అవసరమని అన్నారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం కన్నా.. సీఎం జగన్ ఐదేళ్ల పాలనతో రాష్ట్రం ఎక్కువగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాన్ని తాకట్టు పెట్టి పాలన సాగిస్తున్నారంటే వైసీపీ దుర్మార్గాలేంటో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని వివరించారు. వైసీపీ పాలనలో ఒక సామాజిక వర్గం మినహాయిస్తే రాష్ట్రంలోని అన్ని కులాలు ఏదో విధంగా నష్టపోయాయని అన్నారు. ప్రత్యేకించి దళితులు, మైనార్టీలు తీవ్ర అవమానాలకు గురయ్యారని చెప్పారు. కాగా టీడీపీ బీసీలకు పుట్టినిల్లు అని అందుకే జయహో బీసీ సదస్సులకు లక్షలాదిగా జనం తరలివచ్చారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వెనకబడిన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీపై నమ్మకంతోనే బీజేపీ పెద్దలు పొత్తుకు ముందుకొచ్చారని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కలయికతో రాష్ట్ర ప్రజలకు మేలు జరగనుందని అన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు


టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 10 : నంద్యాల పట్టణంలోని వివిధ వార్డు నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరడం కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని 5వ వార్డు నడిగడ్డకు చెందిన వైసీపీ నాయకుడు, ఆ పార్టీ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు హాజీతో పాటు 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఫిరోజ్ మాట్లాడుతూ వార్డుల్లో వైసీపీ ఖాళీ అవుతుందని, చంద్రబాబు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోకు ఆకర్షితులై, వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకతతో టీడీపీలోకి చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసిన, ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలా ఫలకాల కోసం పాకులాడుతున్న ఎమ్మెల్యే


గోస్పాడు: నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి శిలా ఫలకాల కోసమే పాకులాడుతున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఎద్దేవా చేశారు. ఆదివారం గోస్పాడులో మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లె విశ్వనాథ్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జీ శ్రీనివాస యాదవ్, మండల టీడీపీ నాయకుడు శీలం భాస్కర్‌ల ఆధ్వర్యంలో చాయ్‌పే చర్చ కార్యక్రమం జరిగింది. ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ గోస్పాడు మండలంలో టీడీపీ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వ హయంలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయబోయే సూపర్-6 పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందగా నిలుస్తాయని అన్నారు. మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నంద్యాల 19వ వార్డు టీడీపీ కార్యకర్త భార్య వాణికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. పొన్నాపురంలోని బుడగజంగాల కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త యడవల్లి నరసింహ భార్య వాణి మహానంది నుంచి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె గాయపడింది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

సంగమేశ్వర ఆలయం పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన నూలు, పెసర పంటలు


ముంపు భూముల్లో సిరుల పంటలు

మినుము పంట


కొత్తపల్లి, మార్చి 10: మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని నీటి ముంపు భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నీరు తగ్గిన వెంటనే నీటిలో నిక్షిప్తమైన భూములు బయల్పడ్డాయి. దీంతో మండలంలోని ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, భట్వారుపల్లి, సింగరాజుపల్లి, ముసలిమడుగు, జానాల గూడెం, బలపాలతిప్ప తదితర గ్రామాల రైతులు వేలాది ఎకరాల్లో ఒండుమట్టితో కూడిన సారవంతమైన నల్లరేగడి భూముల్లో నూలు, పెసలు, మినుములు తదితర వాణిజ్య పంటలు సాగు చేశారు. వీటికి విత్తనం ఖర్చు మినహాయిస్తే ఎలాంటి రసాయనక మందులు వేయకుండానే అధిక దిగుబడులు వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. కనుచూపు మేరల్లో నులక భూముల్లో పచ్చని పంటలు సాగు చేయడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ప్రతి ఏడాది శ్రీశైలం రిజర్వాయరులో నీరు తగ్గిన వెంటనే వేసవి కాలంలో ఈ పంటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఏదేమైనా రైతులకు ఈ పంటలు సిరులు కురిపిస్తున్నాయనే చెప్పవచ్చు.

నీటి ముంపు భూములతోనే జీవనాధారం



శ్రీశైలం రిజర్వాయరు నుంచి వేసవి కాలంలో ముంపు నుంచి భూములు బయల్పడుతుంటాయి. ప్రస్తుత వేసవి కాలంలో ముంపు భూముల్లో 20 ఎకరాల్లో నల్ల నూగులు సాగు చేశాను. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటం రూ.14వేలు చేరడంతో ఈ పంటలను సాగు చేశాం. ప్రధానంగా ఎలాంటి విత్తన ఖర్చు మినహాయిస్తే.. ఎలాంటి ఎరువుల ఖర్చులు లేకపోవడంతో ఇలాంటి వాణిజ్య పంటలపై దృష్టి సారించి జీవనం సాగిస్తున్నాం.

- సీలం లింగన్న, రైతు, పాతమాడుగుల

అలరించిన నృత్య ప్రదర్శనలు



శ్రీశైలం, మార్చి 10: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆదివారం నిత్యకళారాధన వేదిక వద్ద కేవీ సత్యనారాయణ, కుప్ప కృష్ణవేణి బృందంచే సంప్రదాయ నృత్యం, కళ్యాణి ద్విభాష్యం బృందంచే గాత్ర సంగీతం కార్యక్రమాలను నిర్వహించింది. కళాకారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

నంద్యాల క్రైం, మార్చి 10 : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సమావేశం జి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అంకయ్య హాజరై మాట్లాడారు. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఈతాలు పెంచాలని, కాంట్రాక్టర్లు ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలివ్వాలన్నారు. పీఎఫ్ డబ్బులు బకాయిలతో పాటు చెల్లించాలని, ఈఎస్‌ఐ, ఫ్యామిలీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఆస్పత్రుల్లో వర్కర్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి డి.శివబాలకృష్ణ, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుశీలమ్మ, డి.శ్రీనివాసులు, మహేష్, జి.ప్రసాద్, తులసమ్మ, రమణమ్మ, శివ, పుల్లయ్య, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జైభీం జైభారత్ కమిటీ సభ్యులు

ఆత్మకూరు రూరల్, మార్చి 10: ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్, ఎస్సీ ఎస్టీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి శీలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జై భీమ్ జై భారత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని, పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శాశ్వత మంచి నీటి పరిష్కారం కోసం రెండు బోర్లు వేయాలని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, ఎక్స్‌రే సెంటర్‌ను, ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవికుమార్, నాగస్వామి నాయక్,రమేష్ నాయక్,సురేష్, దాసు, ప్రతాప్ మల్లికార్జున నాయక్, నాగరాజు నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14 నుంచి కురుకులాంబదేవి జయంత్యుత్సవాలు



ఆత్మకూరు రూరల్, మార్చి 10: ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవీ ఆలయంలో జయంత్యుత్సవాలను 14 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 14న వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం,15న షష్టీ శ్రీసూక్త హోమం,16న సప్తమి రుద్రహోమం,17న నవగ్రహ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో చివరిరోజైన మార్చి 18న అమ్మవారికి అభిషేకాది క్రతువులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో చండిహోమం, బలిదానం, పూర్ణాహుతి, మర్జానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చుక్కల దుప్పి మృతి



వెలుగోడు, మార్చి 10 : నల్లమల అటవీ ప్రాంతంలోని స్మృతివనం సమీపంలో కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. ఆదివారం వెలుగోడు రేంజ్ అటవీశాఖ అధికారి ఎంఎ ఖాన్ తెలిపిన వివరాల మేరకు.. చుక్కల దుప్పిని కుక్కలు తీవ్రంగా దాడి చేసి గాయ పరచడంతో గాయాలపాలై తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెదినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు పశు వైద్యాధికారి జబేదాతో పంచనామా నిర్వహించి కళేబరాన్ని దహనం చేశామని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు అందజేసిన డాక్టర్ ప్రభు ఇమ్మానియేల్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 10 : నంద్యాల పొన్నాపురంలోని ఇమ్మానియేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇమ్మానియేల్ ఫౌండేషన్ సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమానికి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎల్ ప్రభు ఇమ్మానియేల్, ఫౌండర్ డాక్టర్ ఇమ్మానుయేల్, కోశాధికారి డాక్టర్ రత్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు ఏలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా రాయాలని అన్నారు. ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలకు అందులో విద్యార్థులకు వచ్చిన జవాబులను రాయాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

● తరలి వచ్చిన భక్తులు ● కిటకిటలాడిన ఆలయాలు


నందికొట్కూరులో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

శివరాత్రి ఉత్సవాలు ఆదివారం రోజు ముగిశాయి. గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల రథోత్సవాలు జరిగాయి. ఈ రథోత్సవానికి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బండిఆత్మకూరు, మార్చి 10: నల్లమల అటవీ ప్రాంతంతో వెలిన ఓంకార క్షేత్రంలో గంగా, ఉమా సమేత సిద్దేశ్వర స్వామి వార్ల రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆదివారం నాడు మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథాన్ని ప్రత్యేకంగా అర్చకులు అలంకరించారు. ముందుగా రథానికి కుంభం సమర్పించి, గుమ్మడి బలిహరణ గావించారు. అనంతరం స్వామి వార్ల ఉత్సవమూర్తుల పీఠాన్ని ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈవో నాగప్రసాద్, పాలక మండలి సభ్యులు, పలువురు నాయకులు రథం వద్దకు చేర్చారు. అర్చకులు పూజలు, హారతి అనంతరం భక్తజనం ఆలయ పురవీధుల గుండా మేళతాళాల వాయిద్యాల నడుమ ఓం నమః శివాయ అని స్మరిస్తూ రథాన్నిలాగారు. వేలాదిగా భక్తజనం పాల్గొన్నారు. కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం

నందికొట్కూరు, మార్చి 8: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయం నుంచి రథోత్సవాన్ని నిర్వహించారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో ఆదివారం దుర్గాభోగేశ్వరుల రథోత్సవం రమణీయంగా సాగింది. దుర్గాభోగేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భోగేశ్వరుడి రథోత్సవానికి ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ ప్రాణ ప్రతిష్ఠ, నాకబలి, భేరి పూజలు చేశారు. దుర్గాభోగేశ్వరుడి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన నంది కోలాటం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఛైర్మన్ సునిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


పాణ్యం పాణికేశ్వరస్వామి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


భోగేశ్వర ఆలయంలో రథం లాగుతున్న భక్తులు


ఓంకారంలో రథాన్ని లాగుతున్న భక్తజనం

పాణ్యం, మార్చి, 10 : స్థానిక పాణికేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ ఈవో సువర్ణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రాతః కాలపూజలు, శ్రీవారి అభిషేక, ధూప, దీపనైవేద్యాది మంగళ నీరాజనాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవమూర్తులను పురవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవ భజన బృందం నిర్వాహకులు బాల మద్దిలేటి, కీబోర్డు ప్లేయర్ బలపనూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో చెక్కభజన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటి అర్చకులు మల్లికార్జున పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కేసీకి జలకళ



కేసీలో ప్రవహిస్తున్న నీరు

చాగలమర్రి, మార్చి 10: మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు నీరు విడుదల చేయడంతో ఆదివారం జలకళ సంతరించుకుంది. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. సంతజుటూరు మీదుగా రాజోలి చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్టకు 100 క్యూసెక్కుల నీరు చేరిందని అన్నారు. ఆ నీటిని కేసీ ప్రధాన కాలువకు విడుదల చేశామని అన్నారు. తాగునీటి కోసం ఈ నీటిని విడుదల చేశారని ఏఈ పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

డోన్(రూరల్), మార్చి 10: బీ.ఫార్మశీ చదువుతూ ఫీజుకు ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థినికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం కేవీఎస్ హాస్పిటల్, చిన్న పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ శ్రీధర్, కేవీఎస్ హాస్పిటల్ గైనకాలజిస్టు దీపికలు రూ.15వేల ఆర్థిక సాయాన్ని పేద విద్యార్థిని నాగేశ్వరమ్మకు అందజేశారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన సూర్య, పద్మ తన కూతురు తిరుపతిలో బీ.ఫార్మశీ చదువుతుందని, ఫీజు కట్టడానికి ఇబ్బంది పడుతుంది. సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన కేవీఎస్ హాస్పిటల్ యజమాన్యం ఈ మేరకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైఖ్యరాలు షమీమ్ బేగం, కౌన్సిలర్ సుంకయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

బనగానపల్లె, మార్చి 10: స్థానిక ఉన్నతపాఠశాల ఎదుట సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని గౌడ వర్గీయుల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవి ష్కరించారు. తెలంగాణ గడ్డపై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు పాపన్నగౌడ్ అని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గౌడ కులపెద్దలు పాల్గొన్నారు.

హెల్మెట్లు వినియోగం తప్పనిసరి

రుద్రవరం, మార్చి 10: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టులు ధరించడం తప్పనిసరి అని ఆటోయాత్రికుడు మర్రిపల్లె అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం మండలంలోని నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో ఆటోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

మాజీ జడ్పీటీసీ మృతికి సంతాపం

చాగలమర్రి, మార్చి 10: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో మాజీ జడ్పీటీసీ పులి వీరమ్మ (75) ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ ఆళ్లగడ్డ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి గ్రామాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. వారిలో మనోధైర్యం నింపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు హరిశ్చంద్రారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



భక్తులకు మందులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు, డాక్టర్లు

డోన్(రూరల్), మార్చి 10: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, గ్రామీణ వైద్యులు బాలసుబ్బయ్య, ప్రవీణ్, రఘురాం, వెంకటస్వామి, మల్లికార్జున అచారి పాల్గొన్నారు.

యనకండ్లలో పోలీసు కవాతు



యనకండ్లలో కవాతు నిర్వహిస్తున్న సీఐ, సెంట్రల్ పోలీసులు

బనగానపల్లె, మార్చి 10: మండలంలోని యనకండ్ల గ్రామంలో ఆదివారం సీఐ గంటాసుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహిం చారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కును వినియో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో 50 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పట్టణ సీఐ రమేష్‌బాబు సూచించారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన పి.చింతకుంటలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ అసిస్టెంటు కమాండెంట్ వరిందర్ కుమార్‌తో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

సంజామల, మార్చి 10: ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రామభద్రునిపల్లె గ్రామ సమీ పంలో ఆదివారం చోటు చేసుకుంది. కొలిమిగుండ్ల మండలం తిమ్మనా యునిపేటకు చెందిన దూదేకుల దస్తగిరి, బావమ్మలు సంజామలలో ఆదివారం జరిగే సంతలో కూరగాయలు అమ్ముకునేందుకు ఆటోలో బయలు దేరారు. రామభద్రుని పల్లె చెర్వు వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే పడి పోయింది. ఈప్రమాదంలో భార్యాభర్తలు ఇరువురు గాయపడ్డారు. గాయపడ్డ వీరిని నంద్యాల వైద్యశాలకు తరలించారు.

కోట్ల పర్యటనకు తరలి రావాలి

ప్యాపిలి, మార్చి 10: డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్యాపిలికి వస్తున్నారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని మాజీ ఎంపీపీ టి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని కోట్ల ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌యాదవ్, గండికోట రమేష్, కోదండరామయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకే పొత్తులు

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

డోన్, మార్చి 10: వైసీపీ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడటంతోపాటు ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు పొత్తు పెట్టుకున్నాయని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలులోని కోట్ల నివాసంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డె మహారాజ్, ఆర్మీ రామయ్య, డోన్ మండల అధ్యక్షులు అంజనేయులు, ఉమ్మాజిరావు, శశి, వెంకటేశ్ తదితరులు మర్యాదపూర్వకంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి అభ్యర్థి కోట్ల గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రకటించారు. అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నియంతృత్వ పోకడలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండటం దౌర్భాగ్యమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం టీడీపీ హయాంలో అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసివేయడం పేదల కడుపు కొట్టడం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంస విధానాల వల్ల రాష్ట్ర అభివృద్ధి మరో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. చంద్రబాబు హయాంలో రైతులకు ఎన్నో రాయితీలు ఉండేవని, వాటన్నింటినీ రద్దు చేసి సీఎం జగన్ రైతుల ద్రోహిగా మిగిలిపోయారన్నారు. కరువు ప్రాంతాల్లో రైతులను ఆదుకునే చర్యలు వైసీపీ ప్రభుత్వం అసలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో వైసీపీని గద్దె దించేందుకు చంద్రబాబు చేస్తున్న పోరాటానికి ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన బీజేపీలతో పొత్తు పెట్టుకుని కూటమిగా ఏర్పడిందని తెలిపారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే చంద్రబాబు లక్ష్యమన్నారు.

ముగిసిన రాతిదూలం లాగుడు పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కొలిమిగుండ్ల, మార్చి 10: మండలంలోని గుండుమల్లేశ్వర స్వామి ఆలయ క్రీడా మైదానంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ 40వేలు అనంతపురం జిల్లా ఎల్లనూ రు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన పుట్లూరు సుదర్శన్, కడప జిల్లా ఖాజీ పేట గ్రామానికి చెందిన బొర్రా వెంకట సుబ్బయ్య ఎద్దులు గెలుపొందాయి. రెండో బహుమతి రూ30.వేలు అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన జంగం గురు లోహిత్ ఎద్దులు, అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం రేగడ కొత్తూరు గ్రామానికి చెందిన భూమిరెడ్డి గౌతమ్ కంబైండ్ జత ఎద్దులు గెలుపొందాయి. మూడో బహుమతి రూ.20వేలు కడపజిల్లా వేముల మండల బెస్తవారిపల్లె గ్రామానికి చెందిన గాండ్లపెంట జతిన్, 4వ బహుమతి రూ.10వేలు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వడ్ల రామాపురానికి చెందిన ఎస్.లలిత్‌కుమార్. 5వ బహుమతి రూ.5వేలు, బనగానపల్లె మండలం యాగంటిపల్లె గ్రామానికి చెందిన పుట్లూరు చంద్రహాసరెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామానికి చెందిన జంగం గురులోహిత్ కంబైండ్ ఎద్దులు గెలుపొందాయి. విజేతలకు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బహుమతులు అందించారు.

ప్యాపిలి: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కాకనవరం పుణ్యక్షేత్రంలో నిర్వహించిన రాతిదూలం పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 12 జతల వృషభాలు పాల్గొనగా అందులో అనంతపురం జిల్లా వరదాయపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు వృషభాలు మొదటి స్థానం కైవసం చేసుకోగా, డోన్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వృషభాలు రెండో స్థానం, నంద్యాల జిల్లా పగిడాలకు చెందిన గిరిజా ఎద్దులు మూడవ స్థానం, తుగ్గలి మండలం ఉండేపల్లి గ్రామానికి చెందిన రైతు నాగభూషణం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, మెట్టు రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

డోన్(రూరల్), మార్చి 10: కొత్త బుగ్గ రామలింగేశ్వర స్వామి, పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో స్వామివారి రథోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సన్నిధానంలో ఉన్న మంచినీటి కోనేటిలో తెప్పోత్సవ కార్యక్రమం అనంతరం స్వామివార్లను రథంపై అధిష్ఠించి ఊరేగించారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి రథోత్సవ వేడుకలను తిలకించారు. కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కోట్రికే హరికిషన్, పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త బైసాని రాజు, నిర్వాహకులు పుల్లగూర నాగరాజు, బైసాని నరసింహయ్య ఆధ్వర్యంలో రథోత్సవం జరిగింది.

రథోత్సవంలో పాల్గొన్న కోట్ల నివేదిత: రామలింగేశ్వరస్వామి రథోత్సవంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత పాల్గొని రథాన్ని లాగారు. ఆమె వెంట టీడీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్ ఉన్నారు.

'టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం'

అవుకు, మార్చి 10: టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని సుంకేసుల గ్రామ టీడీపీ నాయకులు కైప చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామి రెడ్డి మంచాల వీర ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సుంకేసుల గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల పట్ల ఆకర్షితులమై సుంకేసుల గ్రామానికి చెందిన 115 కుటుంబాలు ఈ నెల 7న వైసీపీని వీడి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో మంచాల భాస్కర్‌రెడ్డి, సాధుకొట్టం శ్రీనివాసుల రెడ్డి, వలి, దేవదానం, మహేష్, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

ఘనంగా నూర్‌షావలి ఉరుసు

కోవెలకుంట్ల, మార్చి 10: పట్టణంలోని కుందూనది సమీపంలోని నూర్ షావలి స్వామి దర్గా వద్ద ఆదివారం ఉరుసు వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బీసీలను అన్యాయం చేసిన వైసీపీ

దొర్నిపాడు, మార్చి 10: వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని దొర్నిపాడు మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన బీసీ నాయకుడు గాంతీ శంకర్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉన్నా వారికి మాత్రం ఉన్నత పదవులు, అసెంబ్లీలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా తక్కువ సంఖ్యలో ఉండడం బాధాకరం అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రతి ఒక్కరు పోరాడాలని కోరారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అంధకారం చేశారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే రాష్ట్రాన్ని అదోగతి పాలు చేస్తారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసిన రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. సంక్షేమాల పేరిట నాయకులు దోచుకోవడం దాచుకోవడం తప్పా అభివృద్ధి చేయలేదని అన్నారు. కార్యక్రమంలో సుధా శివ నాగేష్, కొమ్ము నాగరాజు, చాకలి రాజు, బుడ్డగారి రమణయ్య, దిబ్బగాళ్ల నరసింహా, కిరణ్, ఓబులేసు తదితరులు ఉన్నారు.

'ఎవరి వృత్తి వారే చేసుకోవాలి'

ఆళ్లగడ్డ, మార్చి 10: సమాజంలో ఎవరు వృత్తి వారే చేసుకుంటే బాగుటుందని టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఇంటిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకుల కంటే కొందరు వైద్యులు స్థలాలు కబ్జా చేస్తున్నారని, అవి కప్పి పుచ్చుకునేందుకు ఇతరులపై నిందలు వేస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ఎవరు దోచుకున్నది ప్రజలకందరికీ తెలుసున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌యాదవ్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నేడు మార్కెట్ వేలం

శిరివెళ్ల, మార్చి 10: మండలంలోని మహదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వారపు సంతకు సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను రుసుములు వసూలు చేసుకునే హక్కును పొందేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకట రమణ, సర్పంచ్ పెద్ది రమణయ్య ఆదివారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన రూ.20 వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీకి పాత బకాయిలు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనేందుకు అర్హులు కాదన్నారు. ఆసక్తి కలిగిని వ్యక్తులు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో వేలంపాటలో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

రూ.12 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

చాగలమర్రి, మార్చి 10: మండలంలోని పెద్దబోదనం, తోడెండ్లపల్లె, ముత్యాలపాడు, డి.వనిపెంట, చాగలమర్రి, చిన్నవంగలి, పెద్దవంగలి తదితర గ్రామాల్లో చేసిన రూ.12 కోట్ల అభివృద్ధి పనులను ఆదివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. డి.వనిపెంట చెంచుగూడెం సమీపంలో రూ.4.20 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. సచివాలయాలు, రహదారులు, ఆర్‌బీకేలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, జేసీఎస్ కో-ఆర్డినేటర్ షేక్.బాబులాల్, ఆయా గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యాలు సహించలేక టీడీపీలోకి వలసలు

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



శిరివెళ్లలో పర్యటిస్తున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, మార్చి 10: వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు సహించలేక రోజురోజుకూ టీడీపీలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్లలోని 93, 94 బూత్‌లలో ఆదివారం పర్యటించి టీడీపీ సూపర్-6 అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. అనంతరం భూమా అఖిలప్రియ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముస్లింలకు రంజాన్ తోఫా, హజ్ యాత్ర, సబ్సిడీ రుణాలు, షాదిఖానాలు, మసీదుల నిర్మాణాలు, వాటి అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తే గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని మరుగునపడేసి ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వైసీపీ నాయకులు కులాలు, మతాల మధ్య చిచ్చులు పెట్టి విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ ఖాజా హుసేన్, గుర్రప్ప, సూరా రామ, బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిఖ్, అబ్దుల్ అజీస్, మహమ్మద్ హుసేన్, పీపీ లింగమయ్య, బాలచంద్రుడు, రవి, ఇస్మాయిల్, షఫివుల్లా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం'



తిప్పారెడ్డిపల్లెలో టీడీపీ సూపర్‌సిక్స్ పత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రుద్రవరం, మార్చి 10 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీడీపీ నాయకులు పక్కీరయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో బాబు సూపర్‌సిక్స్ పత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర గౌడ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షసపాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు ఎల్‌వీ రంగనాయకులు, పోలా గురుమూర్తి అన్నారు. ఆదివారం రుద్రవరంలో ఇంటింటికీ తిరిగి బాబు సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేసింది శూన్యమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వామిదాసు, చంద్రశేఖర్, జనసేన నాయకులు డేవిడ్, సురేష్, ఐ టీడీపీ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి చేయూత దక్కుతుందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని జీనేపల్లె గ్రామంలో టీడీపీ సూపర్-6 మినీ మేనిఫెస్టో అంశాలతో కూడిన పోస్టర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. వైసీపీ నిరంకుశ పాలనను రాష్ట్రం నుంచి తరిమేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె మాధవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సింగిరి, బాషా పాల్గొన్నారు.

సూపర్-6 బ్యానర్ చించివేత : మండలంలోని జీనేపల్లె గ్రామంలో రెండు రోజుల కిందట ఏర్పాటు చేసిన టీడీపీ సూపర్-6 బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. గుంప్రమాన్‌దిన్నె టీడీపీ నాయకుడు కుందూరు మోహన్‌రెడ్డి ఈ విషయాన్ని శిరివెళ్ల పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు ఆదివారం గ్రామానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం టీడీపీ నాయకులు గ్రామంలో సూపర్-6 సంక్షేమ పథకాలతో కూడిన మరొక బ్యానర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు, నంద్యాల మైనార్టీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. ఆదివారం చాగలమర్రి ముత్యాలపాడు బస్టాండులో సూపర్-6 ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి టీడీపీకి ఓటు వేయాలంటూ కోరుతూ ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ విజయం కోసం కృషి చేయాలని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముల్లా అబ్దుల్లా, ఖాజా రసూల్, అజీమ్, కరిముల్లా, భాస్కర్‌రెడ్డి నూర్‌బాష, రమేష్, చోటు, ఓబులేసు, బషీర్, అబ్దుల్లా, నర్సయ్య, సుధాకర్‌రెడ్డి, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు పూజలు



పుట్టాలమ్మను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఆళ్లగడ్డ, మార్చి 10: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పూజలు చేశారు. క్షేత్రంలో వెలిసిన అమ్మవారికి పూజలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి విశేషపూజలు చేసిన మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

గ్రామ దేవతలకు ..

రుద్రవరం, మార్చి 10 : మండలంలోని కొండమాయపల్లె, చిన్నకంబలూరు, యల్లావత్తుల, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం మహిళలు గ్రామదేవతలకు పూజలు చేశారు. పెద్దమ్మమారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

లింగమయ్యస్వామికి.. మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు స్వామివారికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడికి: రుద్రవరంలో సంతాన వేణుగోపాల స్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతాపారాయణం చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయుడికి అమావాస్య పూజలు

రుద్రవరం, మార్చి 10 : రుద్రవరంలోని పడమటివీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామికి ఆదివారం అమావాస్య పూజలు భక్తులు చేశారు. అర్చకులు గోపిశర్మ అభిషేకం తదితర పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, రామలింగేశ్వర, చెన్నకేశవ, పట్టాభిరామ ఆలయాల్లో ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో అమవాస్య పూజలు నిర్వహించారు. కోదండరామాలయంలో సీతారాములకు మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివపార్వతులకు 108 దీపాలచే దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రహ్లాదవరద స్వామికి పట్టువస్త్రాల సమర్పణ



ప్రహ్లాదవరద స్వామికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి రోజా

ఆళ్లగడ్డ, మార్చి 10: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వెలసిన ప్రహ్లాదవరదస్వామికి, అమృతవల్లి అమ్మవారికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఆదివారం సాంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను, చీర, సారె సమర్పించారు. ఈమె రాకను పురష్కరించుకొని ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకి పర్యటను రాష్ట్ర పండువగా గుర్తించడంతో ఆమె స్వామి వారికి పట్టువస్త్రాలు, అమృతవల్లి అమ్మవారికి చీర,సారె సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.25కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఈమె వెంట నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి ఉన్నారు.

నీటి కోసం భగీరథ యత్నం

- ఎండిన బోర్లు
- ఆందోళనలో రైతులు
- మురుగు నీరే శరణ్యం



సజ్జ పంటకు మురుగు నీరు కడుతున్న రైతు

చాగలమర్రి, మార్చి 10: చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో రైతు బాలకృష్ణ సాగు చేసిన సజ్జ పంటను కాపాడుకోవడానికి గ్రామం నుంచి వచ్చే మురుగు నీటితో ఆదివారం తడుపుకున్నారు. పొలంలో ఉన్న బోరు ఎండిపోవడంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు మురికి కాలువకు విద్యుత్ మోటర్ ఏర్పాటు చేసి పైపుల ద్వార పారించి పంటను కాపాడుకుంటున్నానని రైతు పేర్కొన్నారు. బోర్లు అడుగంటి పోవడం వల్ల నీటి సమస్య తలెత్తిందని అన్నారు. మురుగు నీటి కోసం రూ.లక్ష దాక ఖర్చు చేయాల్సి వచ్చిందని అన్నారు. అలాగే అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో రియాజ్ అనే మరో రైతు మురుగు నీటితో మొక్కజొన్న పంటను తడుపుకుంటున్నారు. బోర్లలో నీరు లేకపోవడం వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు.